# పరువంపు

కాలేజీ ప్రాంగణమంతా సీతాకోకచిలుకల్లా విద్యార్థినులు రంగు రంగుల డ్రస్సుల్లో ఇటు, అటు తిరుగుతుంటే, విద్యార్థులు నీట్‌గా టకప్ అయి సీతాకోకచిలుకలు తమపై వాలి మకరందాన్ని గ్రోలాలన్నట్లుగా చూపుల్ని అటూ, ఇటూ తిప్పుతూ తిరుగాడుతున్నారు. లెక్చరర్లు ఎవరి పనుల్లో వారు హడావిడిగ తిరుగుతూ వీరికి వారికి పనులు పురమాయిస్తున్నారు.

ప్రిన్సిపాల్ శ్రీహరి వచ్చి కల్యాణమండపంలా కళకళలాడుతున్న కాలేజీని, కిటకిటలాడుతున్న ఆడిటోరియంని సంతృప్తికరంగా చూసి నిర్వాహకులను మెచ్చుకొని ముఖ్యఅతిథి రాకకై గేటు వద్దకి కదిలారు. అతని భార్య వైశాలిని మాత్రం వెళ్ళి ముందు వరుసలో కూర్చుంది.

కాలేజీ రజితోత్సవాల సంవత్సరం కావడంతో వార్షికోత్సవాలని మూడు రోజుల పాటు ఘనంగా జరపాలని నిర్ణయించింది కమిటీ. తొలిరోజు ప్రఖ్యాత నర్తకి స్మిత డాన్స్ ప్రోగ్రాం, రెండవ రోజు మధురగాయని కిరణ్మయి గాత్రకచేరీ, మూడవరోజు ఆధునిక కవి, ప్రముఖ రచయిత ధీశాలి ఉపన్యాసం, సన్మానం తరువాత విద్యార్థినీవిద్యార్థుల పాటలు, నాటిక ప్రదర్శన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రార్థనాగీతం, తొలిపలుకుల తరువాత నర్తకి రసజ్ఞుల హృదయాలని రంజింపజేసేలా మూడు గంటలసేపు అద్భుతంగా నాట్యం చేసింది. అయిటం, అయిటంకి ఆడిటోరియం దద్దరిల్లేలా చప్పట్లు మారుమ్రోగాయి. అదే విధంగా మర్నాడు గాత్ర కచేరీ కూడా ముగియడంతో ఆర్గనైజర్లు కాలరెత్తుకు తిరగ్గా, గాయని వీనుల విందుగా పాడిన అన్నమయ్య పాటల్ని నెమరేసుకుంటూ కదిలారు సభకి వచ్చిన సంగీత ప్రియులంతా.

చివరి రోజు ప్రఖ్యాత కవి, రచయిత ధీశాలి సాహితీ కార్యక్రమం. ఆ కవి రాసే ఆధునిక కవితలు, కథలు చదవనివారు, మెచ్చనివారు అరుదు. కడలితరంగాల్లా ఆయన కలంలోంచి ప్రవహించే కథలు, కవితలు ప్రతీ వ్యక్తి హృదయాన్ని తాకి

స్పందిస్తాయి. ఆ రచన, శైలి, మాటల కూర్పు, శిల్పం, భావతరంగాల అలజడి వేటికవే సాటని చెప్పాలి. పిన్నా, పెద్ద కూడా ఆయన రచనలంటే గౌరవం - అభిమానం.

సాధారణంగా సాంస్కృతిక కార్యక్రమాలకి వచ్చినంత జనం సాహిత్యపరమైన కార్యక్రమాలకి రారు. అందుకే చివరగా విద్యార్థుల కార్యక్రమం ఏర్పాటు చేస్తే దాని కోసమన్నా జనం వస్తారన్న ఉద్దేశ్యంతో వారిచే ప్రోగ్రాము ఏర్పాటు చేశారు. కానీ అనుకోనంతమంది జనం ఈ కార్యక్రమానికి రావడంతో ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. జనం నిలబడిపోవటంతో మరో వంద కుర్చీలు తెప్పించి వేశారు. అవీ నిండిపోయాయి. కొందరు మెట్లపై కూర్చున్నారు. కాలు కదపడానికి చోటు లేకుండా నేలపై కూడా కూర్చున్నారు. కవి పుంగవుని రాకకి అంతా ఎదురు చూస్తున్నారు.

ఆలస్యమైపోయానన్న కంగారుతో, పరుగులాంటి నడకతో ప్రవేశించింది వైశాలిని. ఎక్కడా ఒక్క కుర్చీ కూడా ఖాళీ లేదు. రిజర్వుడు కూడా పూర్తిగా నిండి పోయాయి. ఇటూ, అటూ చూస్తున్న వైశాలినిని చూసి ఒక విద్యార్థి 'అయ్యో ప్రిన్సిపాల్‌గారి భార్య నిలబడ్డారే' అంటూ ఎక్కడినుంచో ఒక కుర్చీ తెచ్చి స్టేజికి దగ్గరగా వేసి "కూర్చోండి మేడం" అనగానే హమ్మయ్య! అనుకుంటూ ధన్యవాదాలు తెల్పి కూర్చుని, ముఖానికి పట్టిన చమటని రుమాలుతో అద్దుకొంటూ 'ప్రోగ్రాము ప్రారంభం కాలేదులే' అన్న ఆనందంతో తృప్తిగా ఊపిరి పీల్చుకొంది.

వైశాలినికి ధీశాలి అభిమాన రచయిత. అతని కథలు, కవితలు ఏ ఒక్కటి వదలకుండా చదువుతుంది. హాల్లో ఆమె బీరువాలో సగానికి పైగా అతని పుస్తకాలే. అతన్ని కాలేజీ ఫంక్షన్‌కి ఆహ్వానించారని తెలిసిన దగ్గరనుంచి ఆమె మనసు ఆనందంతో పులకించిపోతోంది. ఇన్నాళ్ళకి తన అభిమాన రచయితని చూడగలుగుతున్నానన్న ఆనందం పట్టలేకపోతోంది. భర్తతో 'ధీశాలిని ఒక పూట తప్పక భోజనానికి పిలవ'మని మరీ మరీ చెప్పింది. రేపు మధ్యాహ్నం ధీశాలికి విందు ఏర్పాటు చేశాడు భర్త. మర్నాటికి కావలసిన సరుకులు తెప్పించడంలో, స్వీట్లు చేసిపెట్టడంతో ఆలస్యమయి ప్రోగ్రాము మిస్ అయిపోతానన్న గాబరాతో ఉరుకులు, పరుగులతో వచ్చింది వైశాలిని.

ఇంతలో బైట హడావిడి, జనం అటూ, ఇటూ పరుగులతో ధీశాలి వస్తున్నారంటూ అంతా ఆయన గౌరవార్థం లేచి నిలబడ్డారు. ప్రిన్సిపాల్ శ్రీహరి పక్క ధీశాలి హుందాగా నడుస్తూ వచ్చి మొదటి వరసలో అతనికై కేటాయించిన సోఫాలో కూర్చున్నాడు.

శ్రీహరి ఆహ్వానంతో ముఖ్య అతిథితోపాటు ధీశాలి వేదికనలంకరిస్తుండగా హాలంతా చప్పట్లతో మారు మ్రోగింది. తెల్లని ఖాదీ దుస్తులతో, గోల్డు ఫ్రేము కళ్ళద్దాలతో దర్జాగా కూర్చున్న ధీశాలివైపు అభిమానులంతా ఆరాధనగా చూశారు.

ఎదురుగా కూర్చున్న వైశాలిని వేదికపై కూర్చున్న ధీశాలిని పరీక్షగా కనుబొమలు ముడివేసి మరీ చూసింది. 'ఇతను - ఇతను సారథి కాదు కదా?' అన్న ఆలోచన రాగానే మరింత పరీక్షగా అతన్నే చూసిన ఆమెకి అతనిలో సారథి పోలికలు చాలా కనపడసాగాయి. మనసు 'అతనే - అతనే' అని నొక్కి వక్కాణించి చెప్తుంటే ఆమె ముఖం వివర్ణమవసాగింది.

గుండెల్లో ఏదో గుబులులాంటిది ప్రారంభమయింది. మనసంతా ఆందోళనతో వికలమయిపోతోంది. వేదికపై ఏం జరుగుతోందో తనకి వినపడటం లేదు. అక్కడి నుంచి పారిపోవాలని వుంది. చుట్టూ చూసింది చీమ దూరడానికి సందులేనట్లుగా హాలంతా కిక్కిరిసి వుంది. ఇందర్ని తప్పించుకుంటూ వెళ్ళినా ప్రిన్సిపాల్‌గారి భార్య ప్రోగ్రాము మధ్యలో వెళ్తోందేమిటని అంతా తన్నే చూస్తారన్న ఆలోచన రాగానే తప్పనిసరిగా నీరసంగా నిట్టూరుస్తూ కుర్చీ వెనక్కి వాలి కూర్చుంది. కాళ్ళల్లో వణుకు, గుండెల్లో దడ. దాంతో కాస్సేపటికి చిన్నగా తలనొప్పి ప్రారంభమయింది. ప్రోగ్రామయ్యేవరకు బలవంతంగా కూర్చుని వందన సమర్పణ కాగానే ముందుగా తనే లేచి బైటికొచ్చేసింది వైశాలిని.

నీరసంగా మంచం మీదకి వాలిపోయిన వైశాలిని మనసుకి ఎంత కళ్ళెం వేసిలాగినా జ్ఞాపకాల గుర్రాలు కాలేజీ రోజులవైపుకి పరిగెత్తడం మానలేదు.

* * *

పద్దెనిమిదేళ్ళ పరువం డిగ్రీలో చేరిన ఆనందం. హాస్టలు జీవితం యొక్క మధురిమ, వంటరి జీవితం స్వేచ్ఛాలోకాల్లో విహరింపజేస్తోంది. అంతా ఏదో కొత్త. అంతకంటే మరింత ఆనందానికి కారణం కొత్త వాతావరణం, కొత్తవారి పరిచయం. ఏదో మేఘాలమీద పయనంలావుంటోంది. అమ్మా,నాన్నల అదుపాజ్ఞలు లేవు. వేళకి రమ్మనేవారు లేరు. ఏం చేసినా అడిగేవారు లేరు. దూదిపింజల్లా ఎగిరిపోయి ఆకాశాన్నంటుతోందామె మనసు.

తొలిరోజు క్లాసులో కూర్చుని క్లాసంతా కలయజూస్తున్న వైశాలిని కళ్ళు చివరగా కూర్చున్న సారథి దగ్గర సడన్‌బ్రేకు వేసినట్లు ఆగిపోయాయి. కారణం అతను తన్నే తదేకంగా చూడటం. మరోక్షణానికి సిగ్గు తెర అడ్డురాగా తల కిందకి దించుకుంది. సూటిగా కళ్ళల్లో గుచ్చుకున్న అతని చూపుల తాకిడికి నరాలెందుకో జివ్వుమన్నాయి.

మళ్ళీ మర్నాడూ అదే పరిస్థితినెదుర్కోవలసొచ్చింది. అతను తన్నే చూస్తున్నాడని తెలిశాక తనూ మాటి మాటికీ క్రీగంటితో అతన్నే చూసేది. అలా అలా కొన్నాళ్ళకి కళ్ళూ కళ్ళూ కలిసి నవ్వుకున్నాయి. మరి కొన్నాళ్ళకి మనసూ, మనసూ కలిసి మూగగా మాట్లాడుకున్నాయి. మరి కొన్నాళ్ళకి మనసులు హద్దులు దాటి మాటలు కలిశాయి.

అంతే!! అది దినచర్యగా మారి, రోజూ బీచ్ ఒడ్డున కలుసుకుని కావలసినన్ని కబుర్లు చెప్పుకునేవారు. కలిసి కిలకిలా నవ్వుకునేవారు. అలా అలా సాగిన వారి ప్రేమ అంతటితో ఆగక ఒంటరి షికార్లని కోరింది.

ఊళ్ళో పార్కులు, సినిమాలు చాలక పక్క పక్క ఊళ్ళకి సైట్‌సీయింగుల కెళ్ళేవారు. అవకాశం చిక్కినప్పుడల్లా చిలిపి అల్లరి పనులతో తన్ని రెచ్చగొట్టే సారథి లేకుండా బతకడం దుర్లభమనిపించేది వైశాలినికి. సినిమాకెళ్తే బాక్సులున్న హాలుకే వెళ్ళాలి. హోటల్‌కెళ్తే ఫేమిలీ రూంలోనే కూర్చోవాలి. అక్కడ చేసే అల్లరి పనులు, చిలిపి చేష్టలు మనసుని స్వాధీనం తప్పించేవి. అతని పక్కన కూర్చున్నంతసేపూ స్వర్గలోకంలో విహరించినట్లే వుండేది.

ఒకరోజు సారథి "శాలినీ! మనం తొందరగా పెళ్ళి చేసేసుకుందాం. ఇక నీకు దూరంగా వుండలేకపోతున్నాను" అన్న మాటలకి ఉలిక్కిపడింది.

తల్లిదండ్రులు ఆమె మదిలో మెదలగానే 'సారథికి తన్నిచ్చి పెళ్ళి చేస్తారా?' అన్న ఆలోచన వచ్చింది. అతని కోరిక ఏమాత్రం తీరేది కాదు. ఒకే క్లాసు, ఒకే వయసు. పైగా కులాలు వేరు. ఛాందసులైన తల్లిదండ్రులీ వివాహానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోరు. తన్ని పై ఊరు పంపి చదివించడానికే పెద్ద గొడవ జరిగింది.

మరి అన్నీ తెలిసి తనెందుకతనితో తిరుగుతోంది? ఎందుకతనికీ అవకాశం ఇచ్చింది? సారథిలోని ఆకర్షణ తననింత సాహసానికి దారితీయించిందేగానీ పెళ్ళి దాకా ఏనాడూ ఆలోచించనివ్వలేదు. స్వాధీనం తప్పిన మనసు అతని వెంట పరిగెత్తేది. అతని స్పర్శ తనకి ఏదో హాయినిస్తోంది. అతని చిలిపి చేష్టలు తన కేదో కొత్త అనుభవాన్నిస్తున్నాయి. అది అలా రోజూ కావాలని మనసు ఆరాటపడుతోంది.

క్లాసులు ముగియగానే తన ప్రమేయం లేకుండానే కళ్ళు అతని కోసం వెతికి, కాళ్ళు అతని కోసం పరిగెత్తేవి. సారథి కనపడగానే మాలతీలతలా అతన్ని చుట్టుకుపోయి మాట్లాడనివ్వకుండా పెదాలలోని మధువుని గ్రోలమని అతని కందిచ్చేది.

ఒకరోజు సారథి అన్నాడు బ్రహ్మదేవుడు నీ శరీరంలో రక్తానికి బదులు తేనె నింపాడు వైశా అని.

"నీ పలుకులు తేనెలొలుకు -
నీ అధరములు మధువు చిందించు
నీ నవ్వులు తేనె చిలుకు -
నీ మనసే మధు కలశం
ఈ మధురమైన మధువును గ్రోలే
సారథెంత పుణ్యంబుజేసె"

అంటూ కవితలు అల్లుతుంటే సిగ్గుతో వళ్ళంతా జలదరించేది.

"ఇంకా చదువు పూర్తవ్వాలిగా! ఆ విషయం ఇప్పుడే ఎందుకు?" అన్న వైశాలిని జవాబుకి "సర్లే ఈ రోజు సినిమా కెళ్ళి, అక్కడినుంచి హోటల్‌కెళ్ళి భోంచేద్దాం. ఆ హోటల్‌లోనే రూం బుక్ చేసుకుని రాత్రి సరదాగా గడుపుదాం" అన్న మాటలకి వెన్నులోంచి సన్నని వణుకు ప్రారంభమయింది. 'ఇంతవరకు అతనితో రాత్రి గడపలేదు. తెగించి చివరిమెట్టుకెక్కితే ఏదన్నా ప్రమాదం సంభవిస్తే? అమ్మా, నాన్నా...అమ్మో'

"ఏమిటాలోచిస్తున్నావు వైశా. నిన్ను తప్ప మరెవ్వర్నీ నేను పెళ్ళి చేసుకోనని మాటిచ్చానుగా? నాకున్న ఒక్క తల్లీ నా మాట ఎప్పుడూ కాదనదు" అని బతిమాలుతున్న సారథిని చూడగానే మనసు ద్రవించి "అలాగే సారథీ తప్పక వస్తా" నంది.

చింతనిప్పుల్లాంటి కళ్ళతో హాస్టల్ గేటు దగ్గర ఎదురుచూస్తున్న తండ్రిని చూసి స్థాణువులా నిలబడిపోయింది. మరో గంటలో సామాను సర్దించి వెంటవుండి ఇంటికి తీసుకొచ్చాడు తండ్రి వైశాలినిని.

"మన కాలేజీ నుంచి ఎవరో వైశాలిని తండ్రికి ఆమె ఎవరితోటో తిరుగుతోందని ఉత్తరం రాశారుట. ఆయన వచ్చి ఈ విషయం వాకబు చేసి, విషయమంతా తెలుసుకొని క్షణాలమీద ఆమె సామాను పేక్ చేయించి తీసుకెళ్ళిపోయా"దన్న మాటల్ని రమ నోట విని శిలలా నిలబడిపోయాడుట సారథి.

ఊరికి తీసుకొచ్చేసిన తండ్రి డిగ్రీ పూర్తిచెయ్యనక్కరలేదంటూ వైశాలినికి సంబంధం చూసి పెళ్ళి చేసేశాడు. కొన్నాళ్ళు సారథి జ్ఞాపకాలు వెంటాడి బాధించినా

సంసార జీవితంలో పడి భర్త అనురాగంలో నెమ్మదిగా పాత విషయాల్ని మర్చిపోయింది వైశాలిని.

* * *

సారథి మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత కనబడటం, అందునా తన అభిమాన రచయిత రూపంలో ఎదురవడం ఓ పక్క ఆశ్చర్యాన్ని, మరో పక్క భయాన్ని కలిగిస్తోంది. అస్తవ్యస్తంగా ఉన్న మనసుని అదుపులో పెట్టుకోలేకపోతోంది. చెప్పలేని భయం, బెంగతో తన గుండె చప్పుడు తనకే వినపడి భయపెడుతోంది. "అతన్ని రేపెందుకు భోజనానికి రమ్మన్నాను? అతని ఎదుటకి ఎలా వెళ్ళడం? నన్ను చూడగానే గుర్తుపట్టి, పాతరోజులు గుర్తొచ్చి ఎలా ఫీలవుతాడు? ఏమనిపిస్తుంది? ఆనాటి ఆరాటం, తపన, విరహం గుర్తొచ్చి నన్ను చూడగానే కోపం కక్షగా మారి ఈరోజు నా భర్తతో పాత విషయాలన్నీ చెప్పేస్తే? నా సంసారం? నా జీవితం?? నా భవిష్యత్??? ఏం కాను – ఏం కాను????"

తల్చుకున్న కొద్దీ భయం, దడ, గాబరాతో నీరసం కమ్ముతోంది పిచ్చి ఎక్కిపోతున్నట్లుంది. అసహనంగా, విసుగ్గా, అటూ ఇటూ దొర్లుతున్న వైశాలినికి బెల్ మోగిన శబ్దం కాగానే వెళ్ళి తలుపు తీసింది.

"ఏమిటోయ్ చెప్పాపెట్టకుండా వచ్చేశావు? నీ అభిమాన కవిని పరిచయం చెయ్యాలనుకుని చూశాను" అంటున్న భర్త మాటలకి "తలనొప్పిగా వుండి వచ్చేశానండీ" అంది. "పరవాలేదులే రేపెలాగ వస్తారుగా" అంటూ భోజనానికి ఉపక్రమించాడు.

కంచం ముందు కూర్చున్న వైశాలినికి తిండి సహించడంలేదు. భర్తవైపు సూటిగా చూడలేకపోతోంది. శ్రీహరి తనకేసి చూడగానే ఏదో తప్పు చేసిన భయంతో తలదించేసుకుని అతని చూపుల్ని తప్పించుకుంటోంది. గబగబా రెండు మెతుకులు తిని లేచిపోతున్న భార్యనిచూస్తూ "జ్వరం కూడా వుందా?" అంటూ ఆమె చేతిని పట్టుకోబోతున్న శ్రీహరిని తప్పించుకుంటూ "లేదండీ" అని వెళ్ళి పడుకుంది.

అన్యమనస్కంగా తప్పనిసరిగా వంట చేస్తున్న వైశాలిని మనసు మాత్రం పిచ్చి ఆలోచనలతో స్థిమితంగా నిలవటంలేదు. 'కాలం ఆగిపోతే బాగుండును. అతను ఏ కారణం చేతన్నా రానంటే దేముడికి కొబ్బరికాయ కొడతాను. భగవాన్ అలా చెయ్యవా?' అని పదే పదే దణ్ణాలెడుతోంది.

టంగున పన్నెండు కొడుతుండగా శ్రీహరి కారు గేటులోకి వచ్చింది. కిటికీలోంచి చూసిన వైశాలినికి భర్తపక్క సారథి కనబడ్డాడు. గుండెల్లో పెద్ద బండరాయి పడ్డట్టయింది. శరీరమంతా చమటతో తడిసిపోతోంది. వంటింట్లోకి పరిగెత్తి గోడకి ఆనుకుని భారంగా ఊపిరి తీసుకోసాగింది.

"వైశాలీ! మంచినీళ్లు పట్రా నీ అభిమాన కవిగారు వచ్చేశారు" అంటూ "మా శ్రీమతి మీ ఫేనండీ. మీ కవితలు, కథలు అంటే ఎంతిష్టమో చూడండి. ఆమె బీరువా అంతా మీ పుస్తకాలే" అంటూ వంటింటి వైపుకి వెళ్ళి భార్య అందించిన మంచినీళ్ల ట్రేలో గ్లాసు ధీశాలికి అందించి వెనకనే వచ్చిన వైశాలినిని చూపించి "నా మిసెస్" అని పరిచయం చెయ్యగానే నమస్కారం అంటూ లేచిన ధీశాలి తొట్రుపాటుగా ఆమెని చూడడం గమనించిన వైశాలిని వెర్రిదానిలా అతన్ని చూసి ప్రతి నమస్కారం చేసి సోఫాలో కూర్చుంది.

శ్రీహరి అతనితో ఏదేదో చెప్తున్నాడు. ఊ కొడుతూనే ధీశాలి తలొంచుకుని కూర్చున్న వైశాలినిని గమనిస్తున్నాడు. అతని చూపుల్ని అప్పుడప్పుడు తలెత్తి చూసి భయం భయంగా తల దించేసుకుంటోంది. ఇవే చూపులు క్లాస్‌రూంలో తనకెంత ఆనందాన్నిచ్చేవి. ఆ చూపుల కోసం ఎంత ఆరాటపడేది. ఆ కళ్ళే! ఆ చూపులే!! ఇవాళ ఎంత భయాన్ని కలిగిస్తున్నాయి.

తనని అతను గుర్తుపట్టినట్లు అతని తత్తరపాటు చెప్పింది. ఇంకా నన్నే ఆరాధిస్తూ వుండి పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిగా వుండిపోయి ఈ రోజు నన్ను భర్త, సంసారంతో ఇలా హాయిగా చూస్తుంటే అతని మనసెంత మండిపోతుంది? ఆ మంట కక్షగా మారి కాలేజీనాటి చరిత్రంతా శ్రీహరికి చెప్పేస్తే? అమ్మో!! నా జీవితం నా బతుకు...??

"ఏమిటోయ్! వైశాలినీ? తలనెప్పి తగ్గలేదా? ధీశాలిగార్ని కలవాలని తపించి పోయావు. ఆయన వచ్చాక మౌనవ్రతం పాటిస్తున్నావేమిటి? అడుగు – నీ సందేహాలన్నీ తీర్చుకో" అంటూ సారథివైపుకి తిరిగి "శాలిగారూ! చిన్న పనిమీద బైటికెళ్ళాలి. ఇంకో ఇద్దరు ఫ్రెండ్సు కూడా లంచ్‌కి వస్తామన్నారు. తీసుకుని ఒక్క అరగంటలో నేను వచ్చేస్తా. ఈ లోగా మా మిసెస్‌తో కాలక్షేపం చెయ్యండి" అంటూ బైటికెళ్ళి కారు స్టార్టు చేశాడు శ్రీహరి.

గదిలో వైశాలిని, సారథి మధ్య భయంకరమైన నిశ్శబ్దం. ఇలాంటి వంటరి క్షణాలకోసం తహతహలాడే వైశాలినికి ఏకాంతం తట్టుకోలేని భయాన్ని కలిగిస్తోంది.

పులి నోట్లో తలెట్టిన మేకలా బెదిరిపోతోంది. సారథిని పలకరించాలంటే ధైర్యం చాలటంలేదు. తలెత్తి అతన్ని చూడలేకపోతోంది. కంటిరెప్పలు నేలకొరిగిపోయాయి.

'భర్త త్వరగా వచ్చేస్తే బాగుండును. త్వరగా భోజనాలు అయిపోతే సారథి పీడ విరగడవుతుంది. ఈ గండం గడుస్తుందా? దేముడా! ఈ రహస్యం మావారికి తెలీనీకు బాబూ! చిన్నతనం ఏదో తెలీక తెలివితక్కువగా చేసిన పొరపాట్లని మన్నించు తండ్రీ' అని మనసులోనే దైవాన్ని ప్రార్థిస్తోంది.

చదువుతున్న పేపరు పక్కకి పెట్టి "వైశాలినీ! గుర్తుపట్టావుకదూ?" అన్న మాటలకి ఏం జవాబు చెప్పాలో తెలీక వెర్రిదానిలా చూస్తున్న వైశాలినిని చూస్తూ "నా పేరు ధీశాలి అనగానే ఎవరో అనుకున్నావా? నీ పేరులోని రెండక్షరాలను తీసుకొని నా కలానికి పెట్టి ఇంతటి కవినయ్యాను. నీ జ్ఞాపకాలే నా గుండెల్లోంచి, నా గుండెలమీదుండే షర్టు జేబులోని ఈ కలంలోకి ఎక్కి నాచేత కథలు, కవితలు రాయించాయి.

"ఇంతపేరు ప్రఖ్యాతులకి నువ్వే కారకురాలవు. అందుకు నీకు ఋణపడివున్నాను. ధన్యవాదాలు చెప్పుకునే అవకాశం అనుకోకుండా ఈ రోజు కలిగింది" అన్న మాటలకి కరెంట్ తీగ శరీరానికి చుట్టుకున్నట్లుగా గిలగిల్లాడి బేలగా అతన్నే చూడసాగింది.

నిర్మలంగా ఉన్న ఆ వదనంలో అదే చిరునవ్వు చిందులాడుతోంది. వయసు తెచ్చిన మార్పు తప్ప మరే మార్పూ లేదతనిలో.

"సారథీ! ప్లీజ్... " అంటున్న ఆమె మాటల్ని పూర్తి కానివ్వకుండానే మధ్యలో ఆపి "నేను వచ్చిన దగ్గరనుంచీ నీలోని భావాలని చదువుతున్నాను. ధీశాలిని! కవినికదా? ఎందుకా భయం? దేనికా బెదురు? చూడు వైశాలినీ! అవి కాలేజీ రోజులు. వయసా పరువంపు పద్దెనిమిది. ఆ వాతావరణం, ఆ వయసు వంటరితనం, ఉడుకురక్తం అనాలోచితమైన చిలిపి పనుల్ని చేయించింది. జీవితమంటే ఏమిటో తెలీని ఆజ్ఞానం. కోరికల గుర్రాలు ఫలించని కలలవైపుకి పరుగులు తీశాయి.

ఆ రోజు నువ్వు సినిమాకి రాలేదని చాలా బాధపడ్డాను. రమద్వారా విషయం తెల్సుకొని పిచ్చివాడినయ్యాను. నా కోసం నిరంతరం బాధపడే తల్లికోసం హేమని భార్యగా స్వీకరించాను. ఆమె నిష్కల్మషమైన ప్రేమ ప్రపంచాన్నే మరిపింపజేసి నన్ను మళ్ళీ మనిషిని చేసింది. నువ్వు పుట్టించిన కవిత్వాన్ని హేమ పరిమళం చేసింది. పరోక్షంగా నువ్వూ, ప్రత్యక్షంగా హేమ నా పేరు ప్రఖ్యాతులకి కారకులు. హేమ ఆత్మీయతలో శాలి కలం పేరుగానే గుర్తొచ్చేది. నీకూ అంతేనేమో!!

ఈరోజు అనుకోకుండా ఇలా కలిశాం. స్నేహితులుగా, చిన్ననాటి కాలేజీమేట్స్‌గా మాత్రమే. అనవసరంగా పాతరోజుల్ని తల్చుకుని భయపడకు. కుర్రచేష్టలు, పొరపాట్లు అలాంటి సంఘటనలు ఎందరి జీవితాల్లోనో జరిగివుంటాయి. మనం ఒకందుకు చాలా అదృష్టవంతులం. ఆ రోజు హోటల్లో రాత్రి గడుపుదామనుకొన్నాం. ఆ తప్పటడుగు వెయ్యలేదు.

ఆ రోజు మీ నాన్న వచ్చి నిన్ను తీసుకెళ్ళిపోవడం మంచిదే అయింది. లేకుంటే ఆవేశంలో మనం హద్దులు దాటి వుంటే ఏమయ్యేది. మలినమైన శరీరాలతో మరొకరితో సంసారం చెయ్యడం నిజంగా నరకమే. మనమా తప్పు చెయ్యలేదని సంతోషిద్దాం. ధైర్యంగా వుండు. ప్రతీ మనిషి తప్పు చేస్తాడు. మర్చిపోవాలి. వాటిని మనలోనే సమాధి చేసేసుకోవాలి" అంటున్న సారథివైపు అశ్రుపూరిత నయనాలతో చూసిన వైశాలిని చేతులు రెండూ ఎత్తి అతనికి నమస్కరించింది.

"ఏమోయ్! భోజనానికి రమ్మంటావా? రెడీయా?" అంటూ లోపలికి వస్తున్న శ్రీహరివైపు నవ్వుతూ చూసి "ఇదిగో అయిదు నిమిషా"లంటూ తేలికైన మనస్సుతో గాలిపటంలా రివ్వున లోనికెళ్ళిన వైశాలిని మనసిప్పుడు స్వచ్ఛమైన పాలనురగలా వుండి ఆనందంతో లేడిపిల్లలా గంతులెయ్యడమే కాకుండా సారథిలో నిజంగా ధీశాలినే చూడసాగింది.

స్వాతి మాసపత్రిక

**జూన్ 1991**